

బై.. బై.. గణేశా!



కపిలేశ్వరపురంలో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకొస్తున్న భక్తులు

గణపతి బప్పా మోరియా అంటూ.. యువకులు ఉత్సాహంతో వినాయకులను సాగనంపారు. గణపతి నవరాత్రులు ముగియడంతో జిల్లాలో భారీగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. భారీ ఊరేగింపుల నడుమ వినాయక మండపాల నిర్వాహకుల నృత్యాలు, యువత సందడితో శనివారం రోడ్లు హోరెత్తాయి. నియోజకవర్గాల పరిధిలో గోదావరితోపాటు స్థానిక కాలువల్లోను వినాయక విగ్రహాల నిమజ్జనాలు చేపట్టి గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు.





మండపేటలో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న యువకులు, రాజోలు వశిష్ఠ గోదావరిలో క్రేన్‌తో నిమజ్జనం

అంబాజీపేట మండలం మాచవరంలో భారీ వినాయక విగ్రహం ఊరేగింపు



కాకినాడ-రాజమహేంద్రవరం గోదావరి కాలువ

గోదారయ్..రయ్!

ఉమ్మడి జిల్లాలో గోదావరి కాలువలపై సరుకు రవాణా

ఒకనాడు రోడ్డు మార్గాలు.. ఆకాశ మార్గాలు ఉండేవి కావు.. కేవలం జల రవాణా లేదంటే నడక.. అందుకే నేటికీ చెబుతుంటారు.. మా తాతలు కాలవల ద్వారా ప్రయాణించే వారని.. అదంతా బ్రిటిష్ వారి కాలంలో మాట.. నేటికీ ఆయా గురుతులు నిడదవోలు, వేమగిరి తదితర ప్రాంతాల్లో ఉన్నాయి.. మళ్లీ ఆ రోజులు రాబోతున్నాయి.. జల రవాణాను మళ్లీ అందుబాటులోకి తేనున్నారు..ఈ మేరకు గోదావరిలో పది మార్గాలను గుర్తించారు.. ఆయా మార్గాల అభివృద్ధికి టెండర్లు పిలిచారు.. అన్నీ అనుకున్నట్టే జరిగితే గోదారిలో రయ్ రయ్ మంటూ వెళ్లిపోవచ్చు.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గోదావరి అంటే అందాలు.. సరదా షికార్లు.. కానీ ఒకప్పుడు రవాణా రంగం అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో గోదావరిపై అనేక ప్రాంతాలకు బోట్లలో సరుకు రవాణా చేసేవారు. పరిశ్రమలకు అవసరమయ్యే ముడిసరుకులను తరలించేవారు.అనేక పోర్టులకు విదేశాల నుంచి వచ్చే కార్గోను సైతం గోదావరి మీదుగా రవాణా చేసేవారు. బోట్లలో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరేవారు.అయితే మళ్లీ ఇప్పుడు మునుపటి తరహాలో కారు చౌక అయిన జల రవాణా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది.గతంలోలా గోదావరి నదిపై బోట్లలో రవాణా జరిగేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం, రాజమ

- పది రూట్లలో సరుకు సరఫరా
- వాటర్‌వేస్ అథారిటీ ప్రతిపాదన
- రవాణాకు సానుకూలత
- పర్యాటక బోట్లకు సౌకర్యం
- కాలువల అభివృద్ధికి టెండర్లు
- పీపీపీ విధానంలో పనులు
- మారనున్న గోదారి

హేంద్రవరం నుంచి విజయవాడ, రాజ మహేంద్రవరం నుంచి భద్రాచలం, అంతర్వేది నుంచి నర్సాపురం,నర్సాపురం నుంచి సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం, నిడదవోలు నుంచి ఏలూరు వరకూ ప్రయాణించేలా మొత్తం పది మార్గా లను ఎంపిక చేసింది.ఈ రూట్లలో కాలువల అభివృద్ధి,కార్గో తరలింపు, పర్యాటకుల రవాణా పీపీపీ విధానంలో అభివృద్ధి చేయబోతోంది.

ఎన్నిదారులో..

గోదావరిని పర్యాటకంగా,పారిశ్రామికంగా ఉపయోగించేందుకు అడుగులు పడుతున్నాయి. పరిశ్రమలకు ముడిసరుకుల రవాణా నుంచి ఆయా పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తుల రవాణా వరకు గోదావరి నది ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకు నేషనల్ వాటర్ వే-4ను అభివృద్ధి చేసి పూర్వ వైభవం తెచ్చేలా సన్నాహాలు చేస్తోంది. కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు ఉన్న ఈ జల రహదారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాలను కలుపుతూ 1,095 కిలోమీటర్లు పయనిస్తోంది. ఈ జల రహదారిలో అత్యంత కీలకమైన కాకినాడ, రాజమహేంద్రవరం,విజయవాడ, భద్రాచలం రూట్లను కొత్తగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ తాజాగా నిర్ణయించింది. ప్రధానంగా గోదావరి నది ద్వారా కాకినాడ, రాజమహేంద్రవరం, విజ యవాడ, భద్రాచలం,అంతర్వేది రూట్లలో కార్గో, పర్యాటక రవాణాకు ఎంతో డిమాండ్ ఉందని భావిస్తోంది.ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరిపై మొత్తం పది రూట్లను ఎంపిక చేసింది. ఈ మార్గాల్లో కాలువలను అభివృద్ధి చేసి సరుకు రవాణా, పర్యాటక రవాణా అభివృద్ధి చేయాలని ప్రతి పాదించింది.ఈ రూట్లలో ఒకప్పుడు సరుకు రవాణా ఎక్కువగా జరిగేది. కాకినాడ నుంచి బకింగ్‌హాం కాలువ వరకు ఎన్నో ఏళ్ల కిందట అనేక పరిశ్రమలకు ఈ కాలువ ద్వారా కార్గో రవాణా అయ్యేది.ఈ నేపథ్యంలో మళ్లీ గోదావరిపై రవాణాకు ద్వారాలు తెరవబోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

గోదారి వయా..

కాకినాడ నుంచి రాజమహేంద్రవరం కాలువ, రాజ మహేంద్రవరం నుంచి విజయవాడకు ఏలూరు కెనాల్, రాజమ హేంద్రవరం నుంచి గండి పోచమ్మ, గండిపోచమ్మ నుంచి భద్రాచలం, పురుషోత్తపట్నం నుంచి భద్రాచలం, పురు షోత్తపట్నం నుంచి పోలవరం, పట్టిసీమ హిల్‌లాక్ టెంపుల్ నుంచి పట్టిసీమ మెయిన్ లాండ్, అంతర్వేది పల్లిపాలెం నుంచి నర్సాపూర్ వెస్ట్, నర్సాపురం నుంచి సఖి నేటిపల్లి, రాజోలు మండలం సోంపల్లి నుంచి అబ్బిరాజుపాలెం, కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం వరకు మొత్తం పది రూట్ల లో గోదావరిలో కార్గో రవాణాకు వీలుగా రహదారులను అభివృద్ధి చేయబోతున్నారు. ఈ మేరకు వాటర్‌వేస్ అథారిటీ ఇటీవల టెండర్లు పిలిచింది. ఈ పది రూట్లను స్ట్రాటజిక్ మార్గాలుగా అభివృద్ధి చేసి పరిశ్రమల క్లస్టర్లు, మల్టీమోడల్ కనెక్టివిటీ పాయింట్లను గుర్తించాలని పలు కంపెనీలను ఆహ్వానించింది. గోదావరిపై గుర్తిం చిన పది రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఒకప్పుడు కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు ఉన్న కాలువ ద్వారా ఏటా 11 మిలియన్ టన్నుల కార్గో రవాణాకు అవకాశం ఉందని కొంతకాలం కిందట వాప్కోస్ అనే సంస్థ అధ్యయనంలో తేల్చింది. ఇందులో 30శాతం కార్గో రవాణా కాకినాడ- రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం- భద్రాచలం, రాజమహేంద్రవరం-విజయవాడ జలమార్గాల్లో జరిగే అవకాశం ఉందని విశ్లేషించింది.

ఎలా ఉపయోగిస్తారంటే..

కాకినాడ పోర్టుకు తెలంగాణ, తమిళనాడు నుంచి వేలాది లారీల్లో భారీ ఎత్తున బియ్యం విదేశాలకు ఎగుమతి కోసం వస్తోంది. భవిష్యత్తులో గోదావరిపై బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించేందుకు అడుగులు పడుతున్నా యి. తెలంగాణ నుంచి పోర్టుకు చైనాకు ఎగుమతి చేయడం కోసం భారీ బండరాళ్లను విజయవాడ -విశాఖ హైవే ద్వారా తరలిస్తు న్నారు. భవిష్యత్తులో ఈ రాళ్లను గోదావరి ద్వారా రవాణా చేయడానికి అనువుగా ఉంటుందని, ఖర్చు కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. వివిధ దేశాల నుంచి కాకినాడ పోర్టుకు బొగ్గు, ఎరువులు దిగుమతవుతున్నాయి. వీటిని తెలంగాణతో పాటు విజయవాడ సమీపంలోని అనేక థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు గోదావరిపై బొగ్గు రవాణా చేయనున్నారు. భద్రాచలం, రాజమ హేంద్రవరంలో కాగితం పరిశ్రమలకు పల్ప్‌ను రవాణా చేయడానికి డిమాండ్ ఉందని గుర్తించారు. రాజమహేంద్రవరం నుంచి ఏలూరు కాలువ ద్వారా విజయవాడకు అనేక రకాల సరుకుల కారుచౌక ధరకు రవాణా చేసేందుకు అవకాశాలు చాలా ఉన్నట్టు గుర్తించారు. కాకినాడ పోర్టుకు క్లింకర్, రాక్‌ఫాస్ఫేట్ వంటి అనేక రకాల కార్గో వివిధ పరిశ్రమలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. వీటన్నింటినీ గోదావరిపై కార్గో రవాణా ద్వారా భారీ ఎత్తున చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వరకు కేవలం పర్యాటకుల కోసం ప్రస్తుతం బోట్లు నడుపుతున్నారు.ఈ రూట్‌లో భవిష్యత్తులో తెలంగాణకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకులను పెద్దఎత్తున తరలించేలా జలరవాణాను ప్రోత్సహించనున్నారు. నర్సాపురం-అంతర్వేది, ముక్తేశ్వరం -కోటిపల్లి రూట్లలో ప్రస్తుతం పంట్లలో రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులో ఈ రూట్లను ఆధునికీకరించి పెద్ద ఎత్తున వస్తు రవాణా,పర్యాటకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేలా జల రవాణా ప్రోత్సహించనున్నారు. దీంతో మళ్లీ పూర్వపు రోజులు రానున్నాయి.



ఆలమూరులో ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

వలంటీర్లలా చేయలేం!

సచివాలయ ఉద్యోగుల ఆందోళన బాట

- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన
- రిజిస్ట్రేషన్ విధులు బహిష్కరణ

పిఠాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు. మునిసిపల్, నగరపంచాయతీ, మండలపరిషత్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను సామూహికంగా బహిష్కరించారు.ఆత్మగౌరవం కోసమే తాము ఆందోళన బాట పట్టామని వారు స్పష్టం చేశారు. ఒక క్లస్టర్‌లో వలంటీర్ విధులను సచివాలయ ఉద్యోగులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం నుంచి ఆందోళన చేపట్టారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అం బేడ్కర్ కోనసీమ జిల్లాలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై విధులు నిర్వహించారని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు అప్పగిస్తూ మ్యాప్ చేయడంతో పాటు బలవంతంగా ఇంటింటికి తిరిగి విధులు నిర్వర్తించే బాధ్యతలు అప్పగిస్తున్నారని తెలిపారు. ఇదే రీతిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ఇంటింటా తిరిగి అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఇంటికి సర్వీస్ నమోదు చేయించాలని సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అధికారులు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగులు గూగుల్‌మీట్ ద్వారా సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను బహిష్కరించాలని, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా పిఠాపురం మునిసిపల్ కార్యాలయంతో పాటు కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, తుని పురపాలక సంఘాలు, గొల్లప్రోలు, ఏలేశ్వర నగరపంచాయతీలు, కాకినాడ కార్పొరేషన్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి వార్డు సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎక్కడికక్కడ ఆందోళనలు నిర్వహించారు. గ్రామ, సచివాలయ ఉద్యోగుల మనోవేదన ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే నిరసన తెలియజేస్తున్నామని సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో
15 నుంచి యూటీఎఫ్ రణభేరి
లారీ-బైక్ ఢీ.. యువకుడి మృతి 7

పరిశుభ్రతను ప్రోత్సహిస్తూ
స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

జిల్లా అధికారులు స్వయంగా పరిశీలించి ఎంపిక చేయాలి : కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతను ప్రోత్సహించే దిశగా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రదానం చేయనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాలులో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల విధివిధానాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుల ఎంపిక ప్రక్రియను జిల్లా అధికారులు నిర్వహించాలన్నారు. స్వయంగా పరిశీలన చేసి అన్ని విభాగాల్లో ఉత్తమ అవార్డులు ఎంపిక చేయాలన్నారు. జిల్లాలోని ఉత్తమ ప్రభుత్వ కార్యాలయాలు, పురపాలక సంఘాలు, మున్సిపల్ వార్డులు, గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్‌స్టాండ్‌లు, ఆసుపత్రులు, పాఠశాలలు, రైతు బజార్ల నుంచి ఉత్తమమైన వాటిని మాత్రమే అవార్డులకు ఎంపిక చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో డి.శాంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీఎల్డీవోలు జె.వేణుగోపాల్, వి.విజయలక్ష్మి, ఎస్ఎన్ రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్లు వి.నిర్మల్ కమార్, జి.శ్రీకాంత్, టీవీ రంగారావు ఉన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న జేసీ నిషాంతి



జేసీ నిషాంతి

- చెన్నై రైల్వేస్టేషన్‌లో అమలాపురానికి చెందిన దివ్యాంగుడి కుటుంబం
- రైలు టిక్కెట్లు, ప్రయాణ సౌకర్యాలను ఏర్పాటు చేయించిన జాయింట్ కలెక్టర్

అమలాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మోసానికి గురై చెన్నై రైల్వేస్టేషన్‌లో చేతిలో చిల్లిగవ్వ లేని దివ్యాంగుడికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి సాయం చేసి ఆదుకున్నారు. అమలాపురానికి చెందిన దివ్యాంగుడు నాగేశ్వరరావుకు ఉద్యోగం ఇప్పిస్తానని శంకరరావు అనే వ్యక్తి నమ్మబలికాడు. దీంతో ఉద్యోగం వస్తుందని భార్య, పిల్లలతో కలిసి నాగేశ్వరరావు చెన్నై చేరుకున్నాడు. చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో నాగేశ్వరరావును కలుసుకున్న శంకరరావు అతడి వద్దనున్న డబ్బులన్నీ తీసుకుని పరారయ్యాడు. మోసానికి గురైనట్టు గుర్తించిన నాగేశ్వరరావు వెంటనే ఫోన్‌లో జాయింట్ కలెక్టర్‌ను సంప్రదించి తన గోడును వివరించాడు. తక్షణం స్పందించిన జేసీ నిషాంతి చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ ఆర్పీఎఫ్ సిబ్బందితో సమన్వయం చేసి నాగేశ్వరరావు కుటుంబానికి రైలు టిక్కెట్లు, ప్రయాణ సౌకర్యాలను ఏర్పాట్లు చేయించారు. అవసరమైన ఖర్చుల కోసం సొంత డబ్బును నాగేశ్వరరావుకు పంపించి జేసీ మానవత్వాన్ని చాటుకున్నారు.

రంగా విగ్రహం ఏర్పాటు..తొలగింపు
కాకినాడలో ఉద్రిక్తత 7

పదిలం కాదు.. శిథిలం!



మామిడికుదురు మండలం అవుట్‌ఫాల్ స్లూయిస్‌పై రెయిలింగ్ విరగడంతో ప్రమాదకరంగా మారిన దృశ్యం

- శిథిలస్థితిలో అవుట్ ఫాల్ స్లూయిస్‌లు
- ప్రమాదకరంగా మారిన కరకట్టలు
- వరదలు వస్తే ముప్పే
- ఆందోళనలో ప్రజలు

మామిడికుదురు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నదీ తీరప్రాంతాల్లో ఏటిగట్టుపై నిర్మించిన అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు శిథిలస్థితికి చేరి ప్రమాదకరంగా మారాయి. దీంతో వరద వస్తే ముప్పు వాటిల్లే ఆస్కారం ఎక్కువ అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది వరదల సమయం కావడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఎప్పుడో బ్రిటీషు వారికాలంలో ఏటిగట్టుపై అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు నిర్మించారు. అవి శిథిలస్థితికి చేరాయి.

60ఏళ్లక్రితం నిర్మించిన స్లూయిస్

మామిడికుదురు మండల పరిధిలోని లూటుకుర్రు, ఆదుర్రు, గోగన్నమఠం గ్రామాల్లోని అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు శిథిలస్థితికి చేరడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఆదుర్రులోని వాడబోధి మీడియం డ్రెయిన్‌పై 60ఏళ్లక్రితం నిర్మించిన ఈ స్లూయిస్ ఏ క్షణాన కూలిపోతుందోనన్న భయాందోళనలో ప్రజలు కలవరం చెందుతున్నారు. స్లూయిస్‌పైన గుంటలు పడి ధ్వంసం కావడంతో గతంలో ఒక ట్రాక్టరు తిరగబడింది. స్లూయిస్ రెండు వైపులా ఉండే రెయిలింగ్ పూర్తిస్థాయిలో విరిగి పడడంతో నిత్యం దీనిపై ప్రయాణించే మత్స్యకారులు, రైతులు భయం గుప్పిట్లో ప్రయాణాలు చేస్తున్నారు. అధికారులు తూతూమంత్రంగా మరమ్మతులు చేసి మమ అనిపించడం తప్పించి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం లేదని ప్రజలు అంటున్నారు. వాడబోధి డ్రెయిన్‌పై 500 హెక్టార్లలో వరి చేలు ఆధారపడి ఉన్నాయని, భారీ వర్షాల సమయంలో మురుగునీరు ఈడ్రెయిన్ మీదగల అవుట్‌ఫాల్‌స్లూయి స్ ద్వారా గోదావరి నదిలోకి చేరుతోందని, దీనివల్ల పంట ముంపునకు గురికాకుండా నష్టం వాటిల్లకుండా ఉండేదని రైతులు చెప్తున్నారు. అటువంటి వాడబోధిని అధికారులు నిర్లక్ష్యం చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వరదలు వచ్చి ఈ స్లూయిస్ కూలిపోతే మామిడికుదురు మండలంతోపాటు రాజోలు మండలం జలమయ్యే పరిస్థితులు ఏర్పడతాయంటున్నారు.

ప్రమాదకరంగా ఏటిగట్లు

నాగుల్లంక నుంచి ఆదుర్రు వరకుగల ఏటిగట్టు మరమ్మతులకు నోచుకోక ప్రమాదకరంగా తయారైంది. బ్రిటీషువారి హయాంలో నిర్మించిన ఏటిగట్లపై రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆధునికీకరణ పనులుచేశారు. ఆ తర్వాత ఏటిగట్లు అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ఆధునికీకరణ పనులపై ఎవరూ దృష్టిసారించకపోవడంతో ఇవి శిథిలస్థితికి చేరి ప్రమాదకరంగా తయారయ్యాయి. మానేపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లోని పలుచోట్ల ఏటిగట్టు బలహీనపడి వరదల సమయంలో ప్రజలను కలవరపాటుకు గురిచేస్తోంది. కొన్నిచోట్ల లీకులు ఏర్పడడంతో సంబంధిత అధికారులు వరదల సమయంలో తాత్కాలిక రక్షణ చర్యలుగా ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వర్షాలవల్ల ఏటిగట్టు కొట్టుకుపోయి వరద వస్తే ఏటిగట్టును ముంచే పరిస్థితి ఏర్పడింది.

అప్పట్లో ప్రమాదకరంగా..

2022 వరదల్లో పాశర్లపూడిలంక సర్పాలరేవు వద్ద వరద ప్రవాహం ఏటిగట్టును ముంచెత్తే ప్రమాదం సంభవించడంతో వెంటనే అధికారులు ఆ సమయంలో రక్షణచర్యలు చేపట్టారు. పలుచోట్ల ఏటిగట్టు పల్లం కావడంతో వరదల సమయంలో ఎలాగని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద ఘంటికలుగా మారిన స్లూయిస్‌లను, కరకట్టలను ఆధునికీకరణ చేసి వరదల సమయంలో కష్టనష్టాలు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.13.40కోట్లతో ప్రతిపాదనలు

నాగుల్లంక, ఆదుర్రు ఏటిగట్టు మీద ఉన్న మూడు స్లూయిస్‌ల నిర్మాణానికి రూ.13.40 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్టు హెడ్‌వర్క్స్ ఏఈ టీవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. లూటుకుర్రు, ఆదుర్రు, గోగన్నమఠంతోపాటు అంతర్వేది వద్ద మరొక అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను నిర్మించనున్నట్టు తెలిపారు. నాగుల్లంక నుంచి ఆదుర్రు వరకు కరకట్టను ఎత్తు వెడల్పు చేయడానికిగాను రూ.96లక్షల నిధులు కేటాయించామని, అవి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు.

నేడు అంతర్వేదిలో నరసింహస్వామి ఆలయం మూసివేత

అంతర్వేది, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 1 నుంచి ఆలయాన్ని మూసివేస్తామని ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 8 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయి. వేకువజామున జరిగే నిత్య అర్చిత అభిషేకం రద్దుచేసి నిత్య సుదర్శన హోమం 10 గంటలకు యథావిధిగా జరుగుతుందని తెలిపారు.

మురమళ్ళలో కల్యాణాలు రద్దు

ఐ.పోలవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు నిర్వహించే కల్యాణాలు రద్దు చేసినట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం రాత్రి స్వామికి కల్యాణం అనంతరం ఆలయం మూసివేస్తారన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి సంప్రోక్షణ అనంతరం స్వామి దర్శనాలు కల్పిస్తామన్నారు.

'ఎండీయూ వాహనాలను లైట్‌గూడ్స్ వెహికల్స్‌గా మార్పు చేసుకోవాలి'

అమలాపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రేషన్ పంపిణీకి వినియోగించిన ఎండీయూ వాహనాలను లైట్ గూడ్స్ వెహికల్స్‌గా మార్పు చేసుకోవాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు కోరారు. జిల్లాలో 261 ఎండీయూ వాహనాలు ఉన్నాయని, సంబంధిత డాక్యుమెంట్లతో అమలాపురం ఆర్టీవో కార్యాలయానికి వచ్చి క్లాస్ ఆఫ్ వెహికల్ లైట్ గూడ్స్ వెహికల్స్‌గా మార్పు చేసుకోవాలన్నారు. వెంటనే వాహన రికార్డులను తీసుకురావాలని ఎండీయూ వాహన యజమానులకు ఆయన సూచించారు.

వెళ్లిరావయ్యా..ఉండ్రాలయ్యా!


యువోత్సాహం : కరపలో గణేశుడి ఊరేగింపులో యువత సందడి


మేము సైతం : అనపర్తిలో సందడిగా విజయగణపతి స్వామి శోభాయాత్ర


వెళ్లొస్తా : కోటిపల్లి వద్ద గోదావరిలో గణేష్ నిమజ్జనం


వెళ్లిరావయ్యా : ఉప్పాడ తీరంలో నిమజ్జనం

జై..జై గణేశా.. జైకొడతాం గణేశా అంటూ ఊరంతా ఊగిపోయారు..గణేశుడి విగ్రహాలను సందడిగా తరలించారు.. చిన్నా పెద్దా అందరూ డ్యాన్స్‌లతో అలరించారు.. మా దేవుడంటూ ఊరంతా నిమజ్జనోత్సవాల్లో భాగమయ్యారు.. ఆదివారం చంద్ర గ్రహణం కావడంతో శనివారం 11వ రోజునే దాదాపుగా గణేశ్ విగ్రహాలన్నీ నిమజ్జనోత్సవాలకు తరలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటు చూసినా ఊరేగింపులతో దద్దరిల్లిపోయింది.. సందడి మారింది.. బై బై గణేశా.. వెళ్లిరావయ్యా గణేశా అంటూ ఉత్సాహంగా వీడ్కోలు పలికారు..


నేనూ.. నీ వెంటే : కరపలో శివలింగం తరలింపు


వచ్చేశాం : కాకినాడ సాగరతీరానికి గణనాథులతో తరలివచ్చిన ట్రాక్టర్ల క్యూ


ఆనంద సాగరం : కాకినాడ తీరంలో గణేశ్ నిమజ్జనోత్సవాలు.. తరలివచ్చిన భక్తజనం


గణనాథుల రథం పరిశీలిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల


నెత్తిన పెట్టుకుంటామయ్యా : శంఖవరం మండలం కత్తిపూడిలో మహిళలు ఇలా..


బుజ్జి గణపయ్యలు : గన్నవరం మండలం చాకలిపాలెంలో 31 విగ్రహాలతో కదిలిన గణనాథుల రథం


బై బై గణేశా : కాకినాడ రూరల్ సర్పవరంలో నిమజ్జనానికి గణేశుడి తరలింపు


అంబాజీపేటలో..


రాజమండ్రిలో..


కోరుకొండలో..


యానాంలో..


కాకినాడలో భారీ గణనాథుడిని తరలిస్తున్న చిన్నారులు

లడ్డూలు.. రూ.లక్షలు!


బిక్కవోలులో లడ్డూను రూ.1.25 లక్షలకు దక్కించుకున్న దోసారావు

చవితి ఉత్సవాల సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు లక్ష్మీగణపతి స్వామికి సురుచి ఫుడ్స్ 50 కిలోలు, మరో ఇద్దరు భక్తులు 60 కిలోలు, 20 కిలోల చొప్పున లడ్డూలను కానుకలుగా అందజేశారు. వీటికి వేలం నిర్వహించారు. 50 కిలోల లడ్డూను రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన నిమ్మకాయల శివ శంకరదోసారావు రూ.1.25 లక్షలకు దక్కించుకున్నారు. 60 కిలోల లడ్డూను విజయవాడ వద్ద వున్న గొల్లపూడికి చెందిన బి.నారాయణ్‌సింగ్-మానస దంపతులు రూ.66,666కు, 20 కిలోల లడ్డూను గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నేతేటి అరుణ కుమారి రూ.22,222కు దక్కించుకున్నారు. వీటిని ఉత్సవ కమిటీ ఛైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, సభ్యులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి అందజేశారు.

-బిక్కవోలు (ఆంధ్రజ్యోతి)

యానాంలో...


లడ్డూను కైవసం చేసుకున్న భక్తుడు

యానాం కనకాలపేట రామాలయం సెంటర్లో కొలువైన మహాగణపతి 108 కిలోల లడ్డూతో పాటు మరో 10చిన్న లడ్డులను వేలం పాటలో అదే గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ కనకాల సత్యనారాయణ రూ.లక్ష 15 వేల ఒక్క రూపాయికి దక్కించుకున్నారు.

-యానాం (ఆంధ్రజ్యోతి)

వెంకన్న ఆలయం... భక్త జనసంద్రం!

వాడపల్లిలో ప్రత్యేక పూజలు

రూ.65 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. నిండు మనసుతో మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి భారీ క్యూలైన్లలో నిలుచుని స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామునే సుప్రభాతసేవ, నీరాజనమంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.65 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.




ప్రత్యేక అలంకణలో స్వామివారు, ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

అమెరికామెడీ నాటికలు ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ),సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అమెరికామెడీ నాటిక ప్రదర్శనలు శనివారం రాత్రి దంటు కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా చిరంజీవిని కుమారి కళాప్రాంగణాన్ని విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి ప్రారంభించారు. ముఖ్య అతిథి ఉప్పులూరి సుబ్బరాయశర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. యంగ్మెన్స్ క్లబ్ అధ్యక్షుడు దంటూ భాస్కర్ సభకు అధ్యక్షత వహించారు. వంగూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు మాట్లాడుతూ నాలుగైదు దశాబ్దాల కిందట తాను రాసిన 30 హాస్య నాటికల నుంచి 5 నాటికలను ఎంపికచేసి 2రోజుల పాటు దంటు కళాక్షేత్రంలో ప్రదర్శించడం సంతోషకరమైన విషయమన్నారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ చిట్టెన్ రాజు అమెరికాలో ఉంటూ మన సంస్కృతి,సంప్రదాయాలను మర్చిపోకుండా అనేక సాహితీ సదస్సులను నిర్వహిస్తూ తెలుగుభాషా సాహిత్యాలకు ఇతోధిక సేవ చేయటం అభినందనీయమన్నారు. భరణి చేతులమీదుగా వేదికపై 5 పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. నాటక రంగానికి విశేష కృషి చేసిన ఆచార్య బీవీ.రమణమూర్తి (మార్గశీర్ష), ఆచార్య డీఎస్ఎన్. మూర్తిలను యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు దంటు భాస్కర్ సంస్థ తరపున సత్కరించారు. అనంతరం మహతి క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే యమసభ, శ్రీజయ ఆర్ట్స్ హైదరాబాదు వారిచే మగపాత్రలేని నాటిక ప్రదర్శించారు. కె.కృష్ణారావు, మార్ని జానకిరామ్ చౌదరి, సుచిత్రామూర్తి, పి.ప్రభుదాస్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.


జ్యోతి ప్రజల్వన చేస్తున్న సినీ నటుడు తనికెళ్ల భరణి

'ఆదిత్య'లో విస్మయ గ్రాండ్ ఫినాలే

కాకినాడ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల డేటాసైన్స్ విభాగం ఆధ్వర్యంలో విస్మయ-2025 గ్రాండ్ ఫినాలే రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. శనివారం జరిగిన ముగింపు సదస్సుకు ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అధ్యక్షత వహించగా జేఎన్టీయూకేలోని యూసీఈకే సీఎస్ఈ ప్రొఫెసర్ ఎల్.సుమలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శేషారెడ్డి మాట్లాడుతూ దేనిలోనైనా ముందు మేల్కొన్న వారినే విజయం వరిస్తుందని విద్యార్థులకు సూచించారు. సుమలత మాట్లాడుతూ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రస్తుతం మార్కెట్లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు డైటా సైన్స్ స్టార్టప్‌లను రూపొందించాలని పిలుపునిచ్చారు. డేటా సైన్స్ డీన్ వరుణ్‌రావు పరిశ్రమల్లో మారుతున్న సాంకేతికత, సాఫ్ట్‌వేర్ అంశాలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కళాశాలల నుంచి 180 మంది డైటా సైన్స్ విద్యార్థులు హాజరు కాగా ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ, మూర్తి, కార్తీక్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలకు ప్రతిభా పత్రాలను అందజేస్తున్న శేషారెడ్డి, సుమలత

రాజేంద్రచోలుడు స్మారకార్థం
రూ.వెయ్యి నాణెం విడుదల

అమలాపురం టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే కాకుండా సముద్రాల మీదుగా నావికా దండయాత్రలు చేపట్టి వాణిజ్యం సంస్కృతిని విస్తరింపచేసిన చోళ సామ్రాజ్యాధినేత రాజేంద్రచోలుడు జ్ఞాపకార్థం ముంబై టంకశాల రూ.వెయ్యి నాణేన్ని విడుదల చేసింది. వలస రాజ్యాలను ఏర్పాటు చేయడంతో పాటు వాణిజ్య మార్గాలను విస్తరించేందుకు తొలిసారిగా రాజేంద్రచోలుడు వెయ్యేళ్ల క్రితమే నావికా దండయాత్రను చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆయనకు 'గంగయ్యకొండచోళ' బిరుదు ప్రదానం చేశారు. చోళసామ్రాజ్యాన్ని విస్తరించిన రాజేంద్రచోలుడిని స్మరించుకుంటూ వెయ్యవ వార్షికోత్సవాన్ని గంగయ్యకొండ చోళపురంలో జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ముంబై టంకశాల 40 గ్రాముల పూర్తి వెండితో 44 మిల్లీమీటర్ల వ్యాసంతో రూ.వెయ్యి నాణేన్ని విడుదల చేసింది. నాణెం ముందు భాగాన భారతదేశ రాజముద్ర, వెనుకవైపు రాజేంద్రచోలుని ముఖ చిత్రంతో పాటు తంజావూరులోని బృహదీశ్వరాలయం, చోలుడు ప్రయాణించిన కౌలను ముద్రించారు. ఈ నాణేన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ ముంబై టంకశాల నుంచి సేకరించారు.



విడుదలైన రూ.వెయ్యి నాణెం



'నన్నయ' అనుబంధ కళాశాలలు రెండింటికి
ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని రెండు కళాశాలలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధించాయని రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బీవీ రాజు కళాశాల అధికారులు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సర్టిఫికెట్‌ను రిజిస్ట్రార్ నుంచి అందుకున్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐదు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలకే ఈ గుర్తింపు లభించిందన్నారు. అందులో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, భీమవరం బీవీ రాజు కళాశాల నన్నయ విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలలుగా ఉన్నాయన్నారు. రెండు కళాశాలల యాజమాన్య ప్రతినిధులకు రిజిస్ట్రార్‌తో పాటు ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీవీ రాజు కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


రిజిస్ట్రార్ స్వామి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న బీవీ రాజు కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్



సీతాఫలం..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బ్రిడ్జి లంకలో సీతాఫల వృక్షంపై సీతాకోకచిలుకలు వాలి ఉడతలు కొట్టిన సీతాఫలాలను ఆరగిస్తుండగా ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పి.మల్లవరంలో 'కింగ్ ఫిషర్'

● అరుదైన పక్షి ప్రత్యక్షం

తాళ్లరేవు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పీ.మల్లవరంలో ఓ అరుదైన పక్షి ప్రత్యక్షమైంది. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఎగురలేని స్థితిలో పడివున్న కింగ్‌ఫిషర్ పిట్టను అటవీ శాఖ అధికారులకు ధూళిపూడి వెంకటరమణ శనివారం అప్పగించారు. అటవీ శాఖ అధికారి వరప్రసాదరావు ఆదేశాల మేరకు ఫారెస్ట్ ఆఫీసర్లు గోపి, విష్ణు పిట్టను తీసుకువెళ్లి చొల్లంగి మడ అడవుల్లో విడిచిపెట్టారు.



అటవీ శాఖాధికారులు స్వాధీనం చేసుకున్న కింగ్‌ఫిషర్ పిట్ట

25 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితుడితో పోలీసులు

చింతూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు పోలీసులు శనివారం చింతూరులోని బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో 25 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్టు చింతూరు ఎస్‌ఐ పీ.రమేష్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బూడుగూడకు చెందిన షేక్ రాంబాబు వయా చింతూరు మీదుగా గంజాయిని భద్రాచలం వైపు తరలిస్తుండగా పట్టుకున్నారు.

సౌమ్యతకు మారుపేరు ..చిన్నరాముడు

● తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

● జిల్లా ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చింది: జేసీ చిన్నరాముడు

● ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా యంత్రాంగం



జేసీ చిన్నరాముడుకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా ... సౌమ్యత, మృదుస్వభావం కలిగి ఉండడం జేసీ చిన్న రాముడు ప్రత్యేకత అని రాజమహేంద్రవరం కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.బదిలీపై వెళుతున్న ఆయన్ని శనివారం సాయంత్రం ఆత్మీయ వీడ్కోలు సభను కలెక్టరేట్‌లో నిర్వహిస్తూ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జేసీ మేఘస్వరూప్‌కి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త విషయాలను నేర్చుకోవడంలో ఆయన ఎప్పుడూ ఆసక్తి చూపేవారని, ఇది ఆయనకు పని పట్ల ఉన్న నిబద్ధత అని అన్నారు. యోగాంధ్ర, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, తదితర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం వెనుక చిన్న రాముడు కృషి ఎంతో ఉందన్నారు. విధి నిర్వహణలో ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఉండేవారన్నారు. చిన్న రాముడు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చిన్న రాముడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం జిల్లా ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిందన్నారు. నూతన జేసీ మేఘస్వరూప్ మాట్లాడుతూ చిన్నరాముడు మంచి మనసున్న వ్యక్తిగా తన ప్రత్యేకతను సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సీతారామమూర్తి, ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణీసుస్మిత, డీఏవో మాధవరావు, డిప్యూటీ కలెక్టర్ భాస్కరరావు, డీఎస్‌వో పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో బాహుబలి లారీ




రోటర్ వాల్ బోల్‌ను తీసుకొస్తున్న లారీ

మోతుగూడెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నుంచి అల్లూరి జిల్లా మోతుగూడెంలోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి శనివారం 68 టైర్ల లారీ వచ్చింది. దీన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఇక్కడ నిర్మిస్తున్న 5,6 యూనిట్లకు సంబంధించి రోటర్ వాల్‌బోల్‌ను దీనిపై తీసుకొచ్చారు. 48 టన్నుల వరకు ఉంటుంది.

'డొంకరాయి' నుంచి నీటి విడుదల

● 3000 క్యూసెక్కుల నుంచి 1000 క్యూసెక్కులకు తగ్గించిన జెన్‌కో అధికారులు



జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామ జిల్లా సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి శనివారం ఉదయం మూడు వేల క్యూసెక్కుల నీటి నుంచి వెయ్యి క్యూసెక్కులకు తగ్గించినట్టు ఏపీ జెన్‌కో అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి జలాశయంలో నీటిమట్టం 1035.10 అడుగులకు చేరుకోవడంతో నీటిని విడుదల చేశారు. అలాగే డొంకరాయి కెనాల్ ద్వారా పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం నాలుగువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని సీలేరు కాంప్లెక్స్ జెన్‌కో అధికారులు తెలిపారు.

ఎంపీడీవోలకు పదోన్నతులు

● రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ

సామర్లకోట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంపీడీవోలుగా పనిచేస్తున్నవారు ఏపీడీ, డీఎ ల్డీవోలుగా పదోన్నతులు పొందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు 'ఆంధ్రజ్యోతి'కి అందిన సమాచారం మేరకు పదోన్నతులు పొందిన అధికారుల వివరాలిలా ఉన్నాయి. పెద్దాపురం ఎంపీడీవోగా పనిచేస్తున్న డీవీ. శ్రీలలిత విశాఖ జిల్లా డ్వామా కార్యాలయంలో డీవీవోగా పదోన్నతి పొందారు. కరప ఎంపీడీవోగా పనిచేస్తున్న మట్లపర్తి అనుపమ పశ్చిమగోదావరి జిల్లా డ్వామా కార్యాలయ డీవీవోగా పదోన్నతి పొందారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో వ్యవసాయాధికారి ఫ్యాకల్టీగా పనిచేస్తున్న సుంకరణం సుబ్రహ్మణ్యశర్మ పదోన్నతిపై సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలోనే వ్యవసాయాధికారిగా పదోన్నతి పొందారు. అలాగే అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎలుబూడి మహేశ్వరరావు అదే జిల్లాలో పీ.గన్నవరం డ్వామా కార్యాలయంలో ఏపీడీగా పదోన్నతి పొందారు. మారేడుమిల్లి ఎంపీడీవోగా పనిచేస్తున్న తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏపీడీగా పదోన్నతి పొందారు. ఈ మేరకు జీవో ఆర్‌టీ 724 పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. పదోన్నతులు పొందిన ఈ అధికారులు 15 రోజుల్లోగా వారికి కేటాయించిన స్థానాల్లో విధులు చేపట్టాల్సి ఉంది.

జిల్లాకు రెండు కొత్త పోలీస్ జాగిలాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాకు రెండు పోలీసు జాగిలాలు చేరుకున్నాయి. వాటి శిక్షణను ఎస్పీ నరసింహ కిషోర్ పరిశీలించి, డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల ఛేదనలో కీలకమైన జాగిలాల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ జాగిలాల పేర్లు కైరా, రాడో అని ఆయన చెప్పారు. రాడో నేరస్తులను పట్టుకోవడం, నార్కొటిక్ పదార్థాలు గుర్తించడంలో ప్రతిభ కనబరుస్తుందన్నారు. ఇది శిక్షణ కాలంలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించిందన్నారు. కైరా పేలుడు పదార్థాలు గుర్తించడంలో ప్రతిభ సాధించిందన్నారు. వీటి రాకతో దర్యాప్తులు మరింత శక్తివంతమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి అందిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్

జువైనల్ జస్టిస్ బోర్డుతో పీడీజే సమావేశం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత శనివారం సమావేశమయ్యారు. బాలనేరస్థుల కేసుల విషయంలో మెరుగైనసేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, మూడో అదనపు మేజిస్ట్రేట్ పీవీ రాఘవేంద్రరావు, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఒడిశా వాసి మృతి

తునిరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు మృతిచెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. నర్సీపట్నం- గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య మృతదేహం పడి ఉండడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు వివరాలపై ఆరా తీశారు. కాగా, ఆయన వద్ద ఉన్న రైల్వే టికెట్, పాన్ కార్డు ఆధారంగా మృతుడు ఆచూకీని వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గోలాఘాట్ జిల్లాకు చెందిన రోమన్ గగోయ్ (35)గా గుర్తించారు. మృతిచెందిన వ్యక్తి అస్సాం రాష్ట్రం నుంచి కేరళకు ట్రైన్‌లో ప్రయాణిస్తున్నాడు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రంగా విగ్రహం ఏర్పాటు..తొలగింపు

» కాకినాడలో ఉద్రిక్తత

» అనుమతుల్లేకుండా ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాల ఏర్పాటుకు వీల్లేదు: కమిషనర్



నాయకులతో చర్చిస్తున్న కమిషనర్ భావన

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలోని శారదా దేవి గుడి, ముత్తా గోపాలకృష్ణ కూడలిలో రంగా విగ్రహం ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జంక్షన్ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇంతలో ఆ జంక్షన్లో విగ్రహాల రగడ మొదలైంది. కొంతకాలంగా ఆ జంక్షన్లో ఎవరికివారుగా తమ నాయకుడి విగ్రహం పెట్టాలంటే, కాదు తమ నాయకుడి విగ్రహం పెట్టాలని పోటీపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో పరిస్థితిని అర్థం చేసుకున్న కమిషనర్ భావన... కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాల మేరకు రాత్రికి రాత్రే జంక్షన్‌లో ఏర్పాటుచేసిన దిమ్మను తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో సమస్య సద్దుమణిగిందనుకున్నారు. ఇంతలో తిరిగి రోటరీ క్లబ్ పనులు ప్రారంభించగా శనివారం తెల్లవారుజామున కొంతమంది వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ భావన సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసుల సహకారంతో విగ్రహాన్ని తొలగించారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహించిన ఆందోళనకారులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. విగ్రహాన్ని తిరిగి అక్కడే పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. ఆందోళనకారులు బ్రిడ్జి పైన ఆందోళన, ధర్నా చేపట్టడంతో విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వాహనాదారులు చాలా ఇబ్బందులకు గురై ఆందోళనకారులపై అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ భావన ఆందోళనకారులతో చర్చించి అనుమతులు లేకుండా పబ్లిక్ ప్లేస్‌లో నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయడానికి వీలులేదన్నారు. చర్చలు విరమింపజేశారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ కేవీ కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు నుంచి పడి వార్డు సభ్యుడి మృతి



కముజు సూరిబాబు (ఫైల్ ఫొటో)

ముమ్మిడివరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామ పంచాయతీ రెండో వార్డు సభ్యుడు కముజు వీరవెంకట సత్యనారాయణ(సూరిబాబు) (48) కొబ్బరిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. సూరిబాబు శనివారం ఉదయం బొండం తీసేందుకు కొబ్బరిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తూ జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా సూరిబాబుకు భార్య, కుమార్తె, తల్లిదండ్రులు ఉన్నారు. మృతదేహాన్ని ముమ్మిడివరం పోలీసులు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అందజేశారు. మృతుడి భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే సూరిబాబు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆరెళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి

పెద్దాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో శనివారం ఆరేళ్ల చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసింది. స్థానికుల వివరాల ప్రకారం.... పట్టణంలోని తాడితోట ప్రాంతానికి చెందిన పాసిల లక్ష్మీదుర్గ ఇంటి బయట ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేయడంతో చిన్నారి తలపై తీవ్ర గాయాలయ్యాయి. తొలుత స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడిన లక్ష్మీదుర్గ

సత్యదేవుడి సన్నిధిలో ట్రాన్స్‌కో సీఎండీ పూజలు



వేదపండితుల ఆశీర్వచనం పొందుతున్న సీఎండీ పృథ్వితేజ

అన్నవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

నేడు ఆలయం మూసివేత

చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సత్యదేవుడి ఆలయం మూసివేయనున్నట్టు ఈవో సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల వరకు వ్రతం టిక్కెట్లను విక్రయిస్తామని, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సర్వదర్శనాలు నిలుపుదల చేసి ఆలయ తలుపులు మూసివేయనున్నట్టు ప్రకటించారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ జరిపి 7గంటల నుంచి సర్వదర్శనాలు, వ్రతాలు పునఃప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.కాగా చంద్ర గ్రహణం రాత్రి 9.50గంటలకు ప్రారంభమై 1.31 వరకు ఉంటుందని దేవస్థానం పండితులు తెలిపారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

సత్యదేవుడికి తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ముమ్మారు పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ప్రదక్షిణ నిర్వహించారు. హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.



గోదావరిలోకి దూకిన వృద్ధురాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆమెకు ఏం కష్టం వచ్చిందో తెలియదు కానీ స్థానికులు చూస్తుండగానే పి.గన్నవరం అక్విడెక్టుపై నుంచి గోదావరి నదిలోకి దూకేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం అక్విడెక్టు చెంతనే లంకలగన్నవరం వైపు ఉన్న వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు అక్విడెక్టుపైకి తీసుకువచ్చారు. అప్పటికే అక్కడ తచ్చాడుతున్న ఓ వృద్ధురాలు వారు చూస్తుండగానే అక్విడెక్టు పైనుంచి దూకేసిందని ప్రత్యక్షసాక్షులు చెప్తున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ బి.శివకృష్ణ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని అక్విడెక్టుపై వృద్ధురాలు వదిలేసిన చెప్పులను పరిశీలించి ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అయితే పోలీసులు చెప్పులను స్వాధీనం చేసుకుని అక్విడెక్టుకు ఇరువైపులా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తామని ఎస్‌ఐ తెలిపారు. కాగా వృద్ధురాలి ఆచూకీ కోసం బంధువులు ఎవ్వరూ రాలేదు.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 15 నుంచి యూటీఎఫ్ రణభేరి

పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అమలాపురం టౌన్/రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు యూటీఎఫ్ రణభేరి జాతా నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.సురేంద్రకుమార్, ఎంటీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు శనివారం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. పరీక్షల మూల్యాంకనం విద్యాశక్తి ఆన్‌లైన్ అప్‌లోడ్, గ్రీన్ పాస్‌పోర్టు తదితర బోధనేతర పనులకు సమయం వెచ్చించాల్సి వస్తుందన్నారు. తక్షణం ప్రభుత్వం పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని, బకాయిపడ్డ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఈ నెల 15 నుంచి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే రణభేరి జాతాను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సంఘ నాయకులు పెన్నాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లారీ-బైక్ ఢీ.. యువకుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన కోట శ్రీనివాస్

కె.గంగవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని యండగండి వద్ద ఊక లోడు లారీ, మోటార్‌బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. శనివారం పామర్రు నుంచి అంగర వైపు వెళుతున్న ఊకలోడు లారీ, యండగండి నుంచి పామర్రు వైపు వెళుతున్న కోట శ్రీనివాస్ బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న యండగండికి చెందిన శ్రీనివాస్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం నుంచి గణపతి నిమజ్జనంలో హుషారుగా పాల్గొన్న శ్రీనివాసు ప్రమాదంలో మృతి చెందడంతో యండగండిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పామర్రు ఎస్‌ఐ ఎస్కే జానీ బాషా చెప్పారు.


రాజోలులో గణేష్ నిమజ్జన ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

బై..బై..గణేషా

- ఘనంగా వినాయక నిమజ్జనం
- భారీగా ఊరేగింపులు

పి.గన్నవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు చివరిరోజు సోమవారం గణేషుడి నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. లంకలగన్నవరంలో శ్రీవిజయబాలగణపతి మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక వాహనంలో స్వామివారిని గ్రామపురవీధుల్లో ఊరేగించి అనంతరం స్థానిక వైనతేయ గోదావరినదిలో నిమజ్జనం చేశారు. అలాగే నాగుల్లంక రామాలయంవద్ద ఏర్పాటుచేసిన వినాయకుని ప్రత్యేక వాహనంలో ఊరేగించి స్థానిక వశిష్ట గోదావరినదిలో నిమజ్జనం చేశారు. పి.గన్నవరం ఆటో యూనియన్‌తోపాటు, శివాలయంవీధి, నాగుల్లంక లారీ యూనియన్‌లతోపాటు మండలంలోని మొండెపులంక, మానేపల్లి, రాజులపాలెం, ముంగండ, కె.ముంజవరం, కె.ఏను గుపల్లి, నరేంద్రపురం తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన గణపతి మందిరాల్లో వినాయకుడి విగ్రహాలను పురవీధుల్లో వైభవంగా ఊరేగించి స్థానిక గోదావరినదీ పాయల్లో, పంటకాల్వల్లో నిమజ్జనాలు చేశారు.

అల్లవరం(ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరు, అల్లవరం, తూర్పులంక, డి.రావులపాలెం, బెండమూర్లంక, బోడసకుర్రు, గుండెపూడి తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు, భారీగా ఊరేగింపులు జరిగాయి. మొగళ్లమూరిలో కుందాలపల్లి శ్రీనివాసరావు, వెంకటసురేష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన ఆలయాలు, గణపతి పందిర్ల వద్ద శనివారం భారీ అన్నసమారాధనలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణపతిని పూరవీధులలో ఊరేగించి నిమజ్జనం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా స్వామివారిని మేళతాళ మంగళవాయిద్యాలు, తీన్‌మార్ డప్పులతో రంగులు పూసుకుని ఊరేగించారు.

వినాయకుడిని దర్శించుకున్న ఎంపీ హరీష్

మాచవరంలో ఉన్న శ్రీ సిద్ధివినాయకుడిని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. అనంతరం ఎంపీ హరీష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి):మండలంలోని అయినాపురం బాడవలో శనివారం గణపతి ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. శనివారం ఉత్సవ విగ్రహాన్ని పవిత్ర నదీజలాల్లో బ్యాండు మేళాలు, బాణసంచా కాల్పులతో ఘనంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, పొద్దోకు నారాయణరావు, చిక్కాల అంజిబాబు, బొంతు నాగరాజు, బొక్కా ధర్మారావు, మట్ట సత్తిబాబు, ఇందుకూరి పాండురంగరాజు, పలువురు ఉన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ చింతలమెరకలోని నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనానికి మండల పరిధిలోని ఆలయాల నుంచి వినాయకుని విగ్రహాలతో ఊరేగింపుగా బాజభజంత్రీలతో బయలుదేరారు. డీజే సౌండ్లతో భారీ బాణాసంచాలతో ఊరేగించారు. కొన్ని గ్రామాల నుంచి రాజోలు, కొన్ని గ్రామాల నుంచి టేకిశెట్టిపాలెం గోదావరి వద్దకు వెళ్లారు.


మలికిపురంలో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు



పాశర్లపూడిరేవులో , అంతర్వేదిలోని టేకిశెట్టిపాలెంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

అంతర్వేది(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక వంతెన వద్ద వనదుర్గ లైటింగ్ రేకపల్లి నరసింహారావు ఆధ్వర్యంలో ఈ నిమజ్జన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. వినాయక విగ్రహాలు పెదలంక వంతెనవద్ద ఉన్న కాల్వలో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. శృంగవరప్పాడు, అంతర్వేది చెరువుగట్టు, అంతర్వేది దేవస్థానంలలో విగ్రహాలను అంతర్వేది వశిష్ట రేవులో నిమజ్జనం చేశారు. అంతర్వేది చెరువు గట్టు, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగిన అఖండ అన్నసమారాధనలో 1500 మంది పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

- **ఉత్సాహంగా విగ్రహాల ఊరేగింపులు**

యానాం(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో గణనాథుని నవరాత్ర మహోత్సవాలు ముగియడంతో శనివారం గణపతి విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్‌గాంధీ బీచ్‌లోని భారతమత విగ్రహం సమీపంలోని జెట్టివద్ద నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల భారీ బందోబస్తును ఏర్పాటుచేశారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది విగ్రహాలను ట్రాలీపై తీసుకువెళ్లి గోదావరిలో నిమజ్జనం చేశారు. ఏర్పాట్లను యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఎస్పీ వరద రాజన్, డీటి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాలను భారీ ఊరేగింపు నడుమ బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా పాశర్లపూడి తీసుకువెళ్లి, పాశర్లపూడి వైనతేయ నదిలో నిమజ్జనం చేశారు. బి.దొడ్డవరంలో వినాయకుని కోలాటం భజనతో గరగ నృత్యాలు, తీన్మార్ డప్పులతో భారీ ఊరేగింపు నడుమ బి.దొడ్డవరంలోని వైనతేయ నదిలో నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఎంపీ హరీష్

అమలాపురం టౌన్(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పాల్గొన్నారు. స్థానిక దుడ్డు వారి అగ్రహారంలో నవరాత్రి ఉత్సవాల్లో ఎంపీ పాల్గొని పూజలు నిర్వహించారు. బండారులంక శ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో కోలాట బృందం చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఎంపీ హరీష్‌బాలయోగి వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో యల్లమిల్లినాగసుధాకొండలరావు, చింతపట్ల బాబు, అంకం దుర్గ తదితరులు పాల్గొన్నారు. నల్లావీధిలోని గణేష్ మండపం వద్ద జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో ఎంపీతో పాటు టీడీపీ నాయకులు గంధం పల్లంరాజు, చిక్కాల వినాయకరావు, బండిగుప్తాపు రంగ, ఆశెట్టి ఆదిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్‌త దితరులు పాల్గొన్నారు.

రాజోలు(ఆంధ్రజ్యోతి): రాజోలు వశిష్ట గోదావరిలో శ్రీగణేష్ నిమజ్జన మహోత్సవ కార్యక్రమాలు గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం అత్యంత వైభవంగా జరిగింది. పి.గన్నవరం, రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల నుంచి వివిధ గ్రామాల నుంచి సుమారు 130 విగ్రహాలను భారీ ఊరేగింపుగా రాజోలు కాటన్ పార్కు నుంచి రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకున్నాయి. గణేష్ నిమజ్జన ఊరేగింపు ర్యాలీని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. క్రేన్‌తో పెద్దపెద్ద విగ్రహాలను వశిష్ట గోదావరిలో నిమజ్జనం చేశారు.


ముమ్మిడివరంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చిబాబు


మాచవరంలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎంపీ హరీష్


పి.గన్నవరం మండలం నాగుల్లంకలో...


ముమ్మిడివరం: చింతలమెరకలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న మహిళలు

అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో పూజలు

అయినవిల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. శనివారం లఘున్యాసాలు 43, పరోక్ష అభిషేకాలు 4, అన్నప్రసాద విరాళం రూ.82210. విరాళం రూ.2663, మొత్తం ఆదాయం రూ.2,19,491 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ దుర్గాభవానీ తెలిపారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు



మామిడికుదురు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి దేవస్థానం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది. వేకువజామున అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ సుప్రభాత సేవ నిర్వహించి స్వామివారికి తొలిహారతిని ఘనంగా ఇచ్చారు. అర్చకులు స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం భక్తుల కోలాహలంతో కిటకిటలాడింది. శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,04,085 ఆదాయంగా వచ్చిందని, స్వామివారిని 3800 మంది దర్శించుకుని నిత్యాన్నదాన పథకంలో 1700 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నేడు ఆలయం మూసివేత

చంద్రగ్రహణం సందర్భంగా బాలబాలాజీ ఆలయాన్ని ఆదివారం మూసివేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ఆలయాన్ని మూసివేసి సోమవారం 10 గంటలకు సంప్రోక్షణ ప్రత్యేక పూజలు అనంతరం దర్శనాలు ప్రారంభిస్తారని తెలిపారు. భక్తులు గమనించాలని సూచించారు.

పేరూరులో స్మార్త పండిత సభ


సభలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్య శర్మ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పేరూరు కౌశిక తీరంలోని శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్మార్త పండిత సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గంటి సుబ్రహ్మణ్యశర్మ, నూకల యజ్ఞనారాయణశర్మ భాగవతార్లు పాల్గొన్నారు. వేద ప్రాశస్త్యాన్ని యజ్ఞనారాయణశర్మ వివరించారు. స్మార్త పండితులను గ్రామస్థులు సత్కరించారు.

ప్రతిభా పురస్కారాలు

కాట్రేనికోన, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సాపేవారిపల్లె హైస్కూల్లో శనివారం హెచ్‌ఎం ఐ.సుధ అధ్యక్షతన కమిడి నీలయ్య ఫౌండేషన్ 2024-25లో టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు అందించారు. ప్రథమ స్థానం సాధించిన యాళ్ళ దుర్గాఅక్షయ్‌కు రూ.15,000లు, ద్వితీయ స్థానం సాధించిన తిరుమాని సత్యవేణికి రూ.10,000లు, తృతీయ స్థానం సాధించిన వైదాని ఐశ్వర్యకు రూ.5,000లు అందించారు. మరో సంస్థ తరపున జంగా పురుషోత్తం ముగ్గురు విద్యార్థులకు రూ.3,000, రూ.2,000లు, రూ.1,000లు అందించారు. కార్యక్రమంలో కమిడి నీలయ్య ఫౌండేషన్ చైర్మన్ కమిడి శాంతనుడు, పీఎంసీ చైర్మన్ కాశి శ్రీనుబాబు, ఫౌండేషన్ సెక్రటరీ కేఎంవీ ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఎస్ఎస్ సత్యనారాయణ, ఇళ్ళ గణేష్, ఎం.శ్రీనివాసరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆకెళ్ల



అమలాపురం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇందుపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, పురోహితుడు ఆకెళ్ల వెంకట నారాయణమూర్తి బుజ్జిని నియమించారు. పవన్‌కల్యాణ్ ఆశయ సాధన కోసం జనసేన ఆవిర్భావం నుంచి బుజ్జి చేస్తున్న కృషిని గుర్తించి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన సీనియర్ నాయకులకు వరుసగా రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవులు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ ఆశయ సాధన కోసం కృషిచేస్తానని, పదవిని కల్పించిన డిప్యూటీ సీఎం పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వినాయకుడి కల్యాణం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీకామాక్షీ పీఠంలో శనివారం శ్రీసిద్ధి బుద్ధి వినాయకుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీకామాక్షీ రత్నకల్యాణ మండపంలో కామేశమహర్షి దివ్య ఆశీస్సులతో పూజ్యంనాగేశ్వరశర్మ, సాయిశర్మల యాజ్ఞికంలో పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీప్రేమ్ గణపతి కల్యాణాన్ని కనుల పండుగగాజరిపించారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం కొత్తలంకలోని వలీబాబా 78వ ఉరుసు మహోత్సవాలు శనివారం జియారత్‌తో ముగిశాయి. ఈనెల 4న ప్రారంభమైన బాబా ఉరుసు ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. శనివారం కొత్తలంకలోని బాబా జెండా స్తంభం నుంచి భక్తులు మొరమొరాలు, పటికబెల్లం, అరటిపండ్లు, కొబ్బరికాయ ముక్కలతో ఊరేగింపుగా తరలివచ్చి బాబా దర్గావద్ద బాబాకు సమర్పించారు. అనంతరం వాటిని ప్రసాదంగా భక్తులకు పంచారు. గేదెల రఘునాథ్‌బాబా, ముజావర్ ఆలీల ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత వసతి, భోజనం సమర్పించారు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎంపీని కలిసిన పలువురు నాయకులు

రాజోలు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఎంపీ గంటి హరీష్‌బాలయోగి, కొత్తపేటలో రాష్ట్ర టీడీపీ పొలిట్‌బ్యూర్ సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యంలను రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ బందెల పద్మ, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ హరీష్‌బాలయోగి, పొలిట్‌బ్యూరో సభ్యుడు సుబ్రహ్మణ్యంను దుశ్శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ బూత్ కమిటీల కోఆర్డినేటర్ చాగంటి స్వామి, అడబాల విజయ్, నాగిరెడ్డి గోపి, సంతోష్, మోహన్, భైరిశెట్టి పాల్గొన్నారు.


ఎంపీ హరీష్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పద్మ, ఎంపీపీ కడలి శ్రీదుర్గ

కోలాహలంగా గణపతి లడ్డూల వేలం


ముమ్మిడివరంలో వేలం పాటలో రూ.లక్షకు గణపతి లడ్డూను దక్కించుకున్న పెద్దిరెడ్డి నాగు



మామిడికుదురు, ఉప్పలగుప్తం వేలం పాటలో లడ్డూను తీసుకెళుతున్న దృశ్యం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పలు పందిళ్లలో లడ్డూలకు వేలం పాటలు నిర్వహించారు. బండారులంక ఊటుకూరివారి వీధిలో శ్రీబాలగణపతి యువజన సంఘం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సమక్షంలో భారీ లడ్డూకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన మట్టపర్తి హిమవెంకట్‌శ్రీసాయి దంపతులు ఆ లడ్డూను రూ.50,116కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో బళ్ల వెంకటేశ్వరరావు, పిచ్చిక నాగరాజు, లక్కింశెట్టి సుబ్రహ్మణ్యం, బాసిన మోహనరావు, బొండా శ్రీను, వాసా దొరబాబు, కొండా బ్రహ్మానందం, గుంటు సోమశేఖర్, బళ్ల శ్రీనివాసచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఇందుపల్లి అరవ గరువులో శ్రీబాలభక్త గణపతి సేవాసంఘం ఆధ్వర్యంలో లడ్డూలను వేలం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన అయ్యల సోమయాజుల నాగశ్రీనివాస్ మొదటి లడ్డూను రూ.41,234కు దక్కించుకున్నారు. రెండో లడ్డూను హైదరాబాద్‌కు చెందిన పప్పు వెంకటజగదీష్ రూ.40వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పీకే విశ్వనాథ్, శిష్టా భవానీశంకర్, టి.సోమేశ్వరరావు, పేరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): మలికిపురం సెంటర్‌లో వేంచేసి ఉన్న వినాయకుడి ఆలయం వద్ద తొమ్మిది లడ్డూలు రూ.74,200కు భక్తులు పాడుకున్నారు. పెద్ద లడ్డూను బోడపాటి సత్తిబాబు రూ.15వేలకు, వలవల శివకుమార్ రూ.11500కు, సూర్యప్రసాద్ ఎలక్ట్రానిక్స్ రూ.10 వేలకు, టీవీ కృష్ణ రూ.9వేలకు, భాస్కరగుప్త రూ.6500కు, హోల్‌సేల్ జాయ్ రూ.5200కు, కుందెం వంశీ రూ.6వేలకు వేలం పాటలో ఈ లడ్డూను దక్కించుకున్నారు.

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం కొత్తలంక కాపుల వీధిలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఉత్సవ విగ్రహ నిమజ్జనం, వేలంపాట ఘనంగా నిర్వహించారు. శనివారం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని బ్యాండు మేళాలు, బాణసంచా కాల్పులతో ఘనంగా ఊరేగింపు నిర్వహించి పవిత్ర నదీజలాల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో పెద్దలడ్డూను పెద్దిరెడ్డి నాగు అనే భక్తుడు రూ.లక్షకు వేలం పాటలో దక్కించుకోగా చిన్న లడ్డూను రూ.60వేలకు జయన వెంకటలక్ష్మణరావు అనే భక్తుడు వేలంలో దక్కించుకున్న వారికి ఉత్సవ కమిటీవారు లడ్డూను అందించి సత్కరించారు. కార్యక్రమంలో వంగా బాబులు, తోలేటి రాంబాబు, గేదెల రఘునాథబాబా, జంగారెడ్డి రమేష్, గొల్లల వాసులు పాల్గొన్నారు.

అల్లవరం(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా గణపతి ఆలయాలు, పందిళ్ల వద్ద శనివారం భారీగా గణపతి లడ్డూల వేలం పాటలు జరిగాయి. మొగళ్లమూరి సిద్ధివినాయక ఆలయం వద్ద 15 కిలోల గణపతి లడ్డూను చెల్లుబోయిన శ్రీనివాస్ రూ.60,500కు వేలంపాటలో దక్కించుకున్నారు. తూర్పులంకలో గణపతి లడ్డూను కాండ్రేగుల బుజ్జి రూ.18,100కు దక్కించుకున్నారు. బెండమూర్లంకలో 36 కిలోల గణపతి లడ్డూను గనిశెట్టి సత్తిబాబు రూ.16వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ కడలి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, కడలి గంగాచలం, మాజీ సర్పంచ్ కాండ్రేగుల వెంకటసత్యనారాయణ, టీడీపీనాయకులు అల్లూరి తిరుపతిరాజు, అల్లూరి గోపాలకృష్ణంరాజు, అల్లు సత్తిబాబు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి): వాడపర్రు లక్ష్మీ గణపతి ఆలయం వద్ద శనివారం గణపతి లడ్డూలను వేలం వేశారు. 12కిలోల లడ్డూను గొలకోటి కొండయ్య రూ.41వేలకు దక్కించుకున్నారు. 11కిలోల మరో లడ్డూను రూ.32 వేలకు వాడపర్రు యువత పాడుకున్నారు. ప్రభుత్వ అవార్డు గ్రహీత సుదర్శనం వెంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిగాయి. నీటిసంఘం చైర్మన్ నల్లా సత్యనారాయణ, మారిశెట్టి రాముడు ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నిమజ్జన ఘనంగా నిర్వహించారు.

రూ.87వేలు పలికిన లడ్డూ

కాట్రేనికోన(ఆంధ్రజ్యోతి): కందికుప్పలో శ్రీ పార్వతీసమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో గణపతి నవరాత్రి సందర్భంగా శనివారం శోభాయాత్ర జరిగింది. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం 18కిలోల లడ్డూను వేలం వేశారు. నూకల పెద్దకాపు రూ.87,100లకు లడ్డూను దక్కించుకున్నారు.

రూ.75,600 పలికిన గణపతి లడ్డూ

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు శివారు చేరీ తోటలో గణపతి లడ్డూ రూ.75,600 వేలం పాటలో పలికింది. గ్రామానికి చెందిన చెల్లుబోయిన హరిబాబు మనుమడు ఈశ్వరబాబు వేలం పాటలో 21 కిలోల లడ్డూను దక్కించుకుని ఊరేగింపుగా ఇంటికి తీసుకువెళ్లి భక్తులకు పంచిపెట్టారు. అదేవిధంగా గాలిదేవరపాలెంలోని వినాయకుని చేతిలో పెట్టిన ఏడు కిలోల లడ్డూను గ్రామానికి చెందిన నార్ని సత్యనారాయణ రూ.66వేలకు పాడుకుని ఊరేగింపుగా తీసుకువెళ్లి భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి'

అమలాపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణం విడుదలచేసి నూజువీడు ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగిని కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంవల్ల కోర్సు పూర్తిచేసి నాలుగు నెలలు గడిచినా విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఒకో విద్యార్థి రూ.2.25లక్షల చొప్పున చెల్లిస్తేనే ధ్రువపత్రాలు అందిస్తామని చెబుతున్నారని ఎంపీకి వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థులకు తక్షణం న్యాయం చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు.

ట్రంప్ విధానాలకు సీపీఎం నిరసన

ముమ్మిడివరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారతీయ సరుకుల దిగుమతిపై అమెరికా 50 శాతం సుంకాన్ని విధించడం పట్ల వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముమ్మిడివరం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంవద్ద నిరసన తెలిపి తహశీల్దార్ టి.సుభాష్‌కు మెమెరాండం అందించారు. వినతిపత్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో సకిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, విత్తనాల రాంబాబు, విత్తనాలు ఏడుకొండలు, ముంగండ దుర్గబాబు, కె.లక్ష్మణరావు, పి.బాలయోగి పాల్గొన్నారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): ట్రంప్ విధించిన 50శాతం సుంకాలను రద్దుచేయాలని మలికిపురంలో వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆక్వా తదితర రంగాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన 50శాతం సుంకాలను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ట్రంప్, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాకు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలికింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, పీతల రామచంద్రరావు, చెల్లుబోయినత ఆతారావు, గెడ్డం ప్రభాకరరావు, దొండపాటి చిట్టిరాజు, ఆకన నాగేశ్వరరావు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి'

మామిడికుదురు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రాధ్యానత ఇవ్వాలని ఎంపీపీ కుసుమ వనజాకుమారి, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబులు సూచించారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో జడ్పీటీసీ మాట్లాడుతూ లూటకుర్రు గ్రామంలో పంటకాల్వపై డామ్ నిర్మించి షట్టర్లు వేయకుండా వదిలేశారని దానివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే షట్టర్లు, బోట్లువేసి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెదపట్నంలంక గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సర్పంచ్ గుబ్బల దుర్గ సమావేశం దృష్టికి తెచ్చారు. మామిడికుదురు, లూటుకుర్రు వెళ్లే పంటకాల్వల్లో ఆర్‌డబ్ల్యుఎస్ పైపులైను వల్ల సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని, దాళ్వా సమయంలో తాగునీరు సుదూర ప్రాంతాలకు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు కోరారు. పలు సమస్యలపై చర్చించి ఎంపీటీసీ, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని, ఎంపీపీ, జడ్పీటీసీలు కోరారు. ఎంపీడీవో జి.భవానీ, అధికారులు పాల్గొన్నారు.

'నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యం'


అన్న క్యాంటీను నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ నిరుపేదకు ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడెక్టు సమీపంలో అన్న క్యాంటీను ఏర్పాటుకు శనివారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి అనంతరం మాట్లాడారు. అన్న క్యాంటీను ద్వారా రుచికరమైన, ఆరోగ్యవంతమైన భోజనం అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. రూ.61లక్షల నిధులతో అన్న క్యాంటీను నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజనీరింగ్ ఈఈ ఎంటీ హుస్సేన్, జేఈ రఘు, పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యనారాయణ, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, చొల్లంగి సత్యనారాయణమూర్తి, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, కె.సత్యనారాయణరాజు, శేరు శ్రీనుబాబు, యడ్ల ఏసు, ఆదిమూలం సూరయ్యకాపు, మల్లాడి గోపి, సుంకరవెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాటరు ట్యాంకు నిర్మాణానికి చర్యలు

లంకల గన్నవరం పరిధిలోని పలు గ్రామాలకు తాగునీరు అందిచేందుకు త్వరలోనే వాటరు ట్యాంకును నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. అక్విడెక్టు సమీపంలో లంకలగన్నవరం వైపు ఇరిగేషన్ స్థలాన్ని స్థానిక ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ స్థలం వాటరు ట్యాంకుకు కేటాయించడంపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఇరిగేషన్ ఎస్ఈ, ఈఈలతో ఆయన అక్కడ నుంచే ఫోన్‌లోమాట్లాడారు. ఈ స్థలాన్ని పరిశీలించి వాటరు ట్యాంకు నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల మాదిరిగా విధులు నిర్వహించలేం

- ఎంపీడీవో కార్యాలయంలో వినతి

పి.గన్నవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వలంటీర్ల మాదిరిగా ఇంటింటీ వెళ్లి ప్రచారం కల్పించలేమని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు వారు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

మామిడికుదురు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులు శనివారం వలంటీరు విధులను బహిష్కరిస్తూ ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ ఆత్మగౌరవ సమస్యకు కారణమైన వలంటీరు విధులను వెంటనే రద్దుచేయాలని, నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో జి.భవానీకి అందించారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల డిమాండ్‌ల పరిష్కారానికి నిరవధిక నిరాహార దీక్షలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీశక్తి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో కార్మికుల పరిస్థితి దారుణంగామారిందని ఆంధ్రా ఆటోవాలా యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు పేర్కొన్నారు. శనివారం అమలాపురం గొల్లగూడెంలో యూనియన్ జిల్లాశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశ ఎజెండాను ఊటాల వెంకటేష్ ప్రవేశపెట్టారు. ఇప్పటికే ఆటో కార్మికులు ఆటోలకు నల్ల జెండాలు కట్టి డ్రైవర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించని పక్షంలోఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రేపిడో, ఊబర్ యాప్‌ల ఆన్‌లైన్ ఆపరేషన్స్ ప్రైవేటు ట్రావెల్స్ యాప్‌లు రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి అనుసంధానంచేస్తూ ఒక యాప్‌ను క్రియేట్‌చేసి ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ మేరకు ఈ నెల 8న నిరసన ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ముందు ఉంచిన పది డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో ఈ నెల 12న జిల్లావ్యాప్తంగా 24 గంటలు ఆటోకార్మికులు నిరవధిక నిరసన సామూహిక నిరాహారదీక్షలు చేపట్టనున్నట్టు సత్తిరాజువెల్లడించారు.

తగ్గుతున్న వరద ఉధృతి


బొబ్బర్లంక వద్ద గోదావరి ప్రవాహం

ఆత్రేయపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదీ పొంగి ప్రవహించింది. ఈ ఏడాది రెండు పర్యాయాలు వరదలు రావడంతో ఆయా లంక గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రస్తుతం గోదావరి ఉధృతి తగ్గుముఖం పడుతూ వస్తున్నది. కాటన్ బ్యారేజీ వద్ద 175 గేట్ల ద్వారా వరద నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. శనివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజీ వద్ద 10.20 అడుగులకు నీటిమట్టం నమోదైంది. దిగువకు 7.69 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. ఆయా లంక గ్రామాల్లోని పలు రకాల పంటలు నీటమునగడంతో లంక రైతులు నష్టాల బారినపడ్డారు.

వైభవంగా అనంతపద్మనాభస్వామి వ్రతం

రావులపాలెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెం శ్రీఅలివేలు మంగ పద్మావతి అండాళ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజల అనంతరం వేద మంత్రోచ్చారణ మధ్య వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


రావులపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో అనంత పద్మనాభస్వామి వత్రం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పథకాలు ప్రజల దరిచేరాలి

కె.గంగవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ ద్వారా అమలవుతున్న పథకాలు


పామర్రు ఆసుపత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో దుర్గారావు దొర

నూరుశాతం ప్రజలకు అందేలా పనిచేయాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి ఎం.దుర్గారావుదొర అన్నారు. దీనికోసం స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని ఆయన తెలిపారు. శనివారం పామర్రు, కుందూరు ఆసుపత్రులను సందర్శించారు. ఆసుపత్రి రికార్డులను ఆయన తనిఖీ చేశారు. వైద్య సేవలను ఆయన సమీక్షించారు. వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణుల నమోదు, ఆసుపత్రి ప్రసవాలు, ఈహెచ్‌ఆర్‌పై రివ్యూ చేశారు. వైద్యులు స్థానిక నాయకులు, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని ఆయన సూచించారు.

పీహెచ్‌సీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఆలమూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్‌లో భాగంగా డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కొత్తపేట అదనపు డీఎంహెచ్‌వో ఎం.సుమలత సూచించారు. పెదపళ్ల పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. ముందుగా పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. వైద్య, ఆరోగ్య సేవలు అందిస్తున్న తీరును స్థానిక రోగులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో పరిసరాల శుభ్రతను ఆమె పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసిన అనంతరం వైద్యాధికారులు డి.సాయికిషోర్, కె.భాగ్యశ్రీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎంఎస్ఎన్.రెడ్డి, హెచ్ఈవో ఏవీవీ రాజా, సూపర్‌వైజర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పెదపళ్ల పీహెచ్‌సీలో వైద్యాధికారులతో చర్చిస్తున్న ఏడీఎంహెచ్‌వో సుమలత



వల్లూరు ప్రాథమిక పాఠశాలలో నో బ్యాగ్ డేతో సందడి చేస్తున్న విద్యార్థులు

నో బ్యాగ్ డేతో మానసికోల్లాసం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నో బ్యాగ్ డేతో విద్యార్థుల్లో మానసికోల్లాసం పెరుగుతుందని పాఠశాల హెచ్‌ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని వల్లూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన నో బ్యాగ్ డేతో విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి శనివారం విద్యార్థులు ఎంతో ఆనందంగా గడుపుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


రాయవరం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సచివాలయ సిబ్బంది

ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కలిగించాలి

రాయవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగులను ఇంటింట సర్వేల నుంచి విముక్తి కలిగించాలని సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపుతో శనివారం ఎంపీడీవో ఎన్. కీర్తస్పందనకు వినతి పత్రం అందజేశారు. తాము ప్రభుత్వానికి, ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకం కాదని, కేవలం ఇంటింట సర్వేల నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. కార్యక్రమంలో మండలం లోని పలు సచివాలయ నుంచి వచ్చిన ఉద్యోగులు కె.శివ, ఎం.శ్రీకాంత్, హారిక తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ

రావులపాలెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళల కోసం ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించడంతో వారి రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. పుణ్యక్షేత్రాలు, షాపింగ్‌లు, బంధువుల ఇళ్లకు వెళ్లిరావడం...ఒకటేమిటి ప్రతిరోజు వారి ప్రయాణాలు రోజువారీ కార్యక్రమాలుగా మారిపోయాయి. ప్రధానంగా వాడపల్లి పుణ్యక్షేత్రానికి రోజురోజుకు భక్తుల తాకిడి భారీగా పెరుగుతోంది. ఉచిత బస్సు ప్రయాణం వచ్చాక మహిళల సంఖ్య కూడా అధికంగా ఉంటోంది. వాడపల్లికి వెళ్లాలంటే రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రావాల్సి ఉండటంతో ప్రతి శనివారం తెల్లవారుజాము నుంచే మహిళలు పోటెత్తుతున్నారు. డిపో మేనేజర్ కుమార్ వాడపల్లికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

గురుపూజోత్సవం

రావులపాలెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురుపూజోత్సవాలను పురస్కరించుకుని గురువుల సత్కారం నిర్వహించారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, సీఆర్పీ అధ్యక్షుడు తాడి నాగ మోహన్‌రెడ్డి, మన్యం పర్వత వర్ధనరావు, జక్కంపూడి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


ఆత్రేయపురం ప్రధాన కాలువలో వినాయక నిమజ్జనం నిర్వహిస్తున్న భక్తులు


కొత్తపేట పొట్టి శ్రీరాములు వీధిలో ఆదిదేవుడికి హారతులిస్తున్న మహిళలు


రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడులో ఆకట్టుకున్న గణపతి ఊరేగింపు


కె.గంగవరం మండలం కోటిపల్లికి వినాయకుడి విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు

గౌరీపుత్రా నమోస్తుతే

• భక్తిశ్రద్ధలతో గణనాథుల నిమజ్జనం • ఆకట్టుకున్న సాంస్కృతిక వేషధారణలు • యువత జోష్


రాయవరం మండలం వెదురుపాకలో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన వినాయకులను శనివారం నిమజ్జనం చేశారు. ర్యాలి గుడిమెరక వినాయకుడు నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివిధ దేవత రూపాల వేషధారణతో జరిపిన ఊరేగింపు ఆకట్టుకుంది. సాయి అనే యువకుడు వేసిన ఛత్రపతి శివాజీ వేషధారణ అలరించింది. ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాలు పూర్తికావడంతో మహాగణపతిని మంగళ వాయిద్యాలతో ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్ కాలువలో నిమజ్జనం చేశారు. పేరవరం బీసీ పేటలో పలువురు గౌడ పెద్దలు వినాయకుడి నిమజ్జనాన్ని నిర్వహించారు. తాడిపూడిలో వినాయకుడి లడ్డూను పేరిచర్ల శ్రీరామరాజు సొంతం చేసుకున్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాము ఆయా ఏర్పాట్లు నిర్వహించారు.

అశ్లీల నృత్యాలపై కేసు నమోదు: ఆత్రేయపురం మండలం వెలిచేరులో వినాయక నిమజ్జనం ఊరేగింపులో హిజ్రాల అశ్లీల నృత్య ప్రదర్శనపై ఎస్ఐ రాము ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. వాటిని ప్రదర్శిస్తున్న వారితో పాటు, కమిటీ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా వినాయకుడి ఊరేగింపులు

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక నిమజ్జన ఊరేగింపులు అట్టహాసంగా నిర్వహించారు. కొత్తపేట కళానగర్ సిద్ధివినాయకుడు, పాత రామాలయం లక్ష్మీగణపతి, పొట్టి శ్రీరాములు వీధిలో వినాయకుని నిమజ్జన ఊరేగింపులు ఆయా ఉత్సవ కమిటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్‌మార్ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గణపతిని ఊరేగిస్తూ ఆయా ప్రధాన పంట కాలువలు, రేవుల్లో నిమజ్జనాలు చేశారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు ముగియడంతో ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకులను ఊరేగించిన అనంతరం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా వినాయక మండపాల వద్ద గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గౌతమి, వశిష్ట పాయలు, కాలువల్లో నిమజ్జనం చేశారు.

నిమజ్జనాల పరిశీలన

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. కోటిపల్లి గోదావరి వద్ద రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.కె.జానీ బాషా, తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కూటమి నాయకులు నిమజ్జనం కోసం వచ్చిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి సుభాష్ తండ్రి సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, మేడిశెట్టి రవికుమార్, గొడవర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): వెదురుపాకలో గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని శనివారం నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వాహకులు ఉత్సాహంగా జరిపారు. గణపతిని ట్రాక్టరుపై ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలను ఉత్సాహంగా జరిపారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను స్థానిక గౌతమీ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. అంగర, టేకి, కపిలేశ్వరపురం, పడమరఖండ్రిక, నల్లూరు, వెదురుమూడి తదితర గ్రామాల వినాయకులను ఊరేగించిన అనంతరం నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండపేట సీఐ దొరరాజు పర్యవేక్షణలో అంగర ఎస్ఐ హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ కార్యదర్శి కె.శివచక్రవర్తి నిమజ్జన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద్ వితరణ చేశారు. స్థానిక తహసీల్దార్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది గణేష్ నిమజ్జనాలను పర్యవేక్షించారు.


కె.గంగవరం మండలం కోటిపల్లి గోదావరి రేవులో మజ్జిగ పంపిణీని ప్రారంభించిన టీడీపీ సీనియర్ నాయకుడు సత్యం

అన్నదానానికి విరాళం: అంగర గ్రామంలో గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదానానికి శనివారం దాతలు రూ.2 లక్షలు విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన కంకటాల వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు కంకటాల వెంకటమల్లేశ్వరరావు, సుబ్బలక్ష్మి దంపతులు, కంకటాల నాగబాబు, లక్ష్మీరత్నం దంపతులు చెరొక లక్ష చొప్పున విరాళం అందించారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణం, మండలంలో శనివారం గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలో వైఎస్ఆర్ నగర్, మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనం జరిగింది. వైఎస్ఆర్ నగర్‌లో గణపతిని గారడీ, తీన్‌మార్ వాయిద్యాలతో ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ నగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్, దబేదార్ నూతి సెంటర్, పిల్లా వారి వీధి, శీలంవారం సావరం, గంగుమళ్లవీధి, వాడపల్లి ఆశ్రమం, అంకంవీధి, రామదుర్గా వీధి, జెండా వీధి వినాయకులను ఊరేగించి నిమజ్జనం చేశారు.

రామచంద్రపురం మండలంలో: రామచంద్రపురం మండలంలో గణేష్ నిమజ్జన వేడుకలు నిర్వహించారు. నరసాపురపుపేట, యనమదల, తాళ్లపొలం, ద్రాక్షారామలో కంబాల చెరువు, సాక్షివారి వీధి, టాక్సీస్టాండు, శుక్రవారపు పేట, బొండెలగూడెం, బుర్రావీధి, ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణం తదితర ప్రాంతాల్లో గణపతి నిమజ్జనాన్ని జరిపారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు ముగియడంతో శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమాలను ఆలయ నిర్వాహక కమిటీలు నిర్వహించారు. మండపేటతోపాటు రూరల్‌లో వున్న ఆయా వినాయక పందిళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. కేపీరోడ్డు, మెయిన్‌రోడ్డు మీదుగా స్వామివారి ఉరేగింపు నిర్వహించారు. ముఖ్యంగా పట్టణంలో పాటి మీద వినాయకుడిని జేసీబీపై ఉంచి ఉరేగింపు అనంతరం కాల్వలో నిమజ్జనం చేశారు. పెద్ద కాల్వ వంతెన, మండపేట రూరల్‌లో తాపేశ్వరం, ద్వారపూడి, కేశవరం, జెడ్.మేడపాడు, వై.సీతానగరం, వెలగతోడు వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు.


కపిలేశ్వరపురంలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


మండపేటలో వినాయకుడిని తరలిస్తున్న దృశ్యం


శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,62,969 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

నేడు శనేశ్వర ఆలయం మూసివేత: చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి శనేశ్వరస్వామి ఆలయం మూసివేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో తెలిపారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటలకు స్వామివారి ఆలయం ఎదురుగా తైలాభిషేకాలు, దర్శనాలు ప్రారంభమం అవుతాయని ఈవో తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

రావులపాలెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం రావులపాలెం-అమలాపురం రహదారిలో జడ్పీ హైస్కూల్ ఎదురుగా కాలువ చెంతనే గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్టు గుర్తించారు. మృతుడికి 35 నుంచి 45 ఏళ్ల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురుపూజోత్సవం

రాయవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాయవరం జూనియర్ కళాశాలలో శనివారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావును సత్కరించారు. అధ్యాపక బృందాన్ని, కళాశాల ఇతర సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామారావు మాట్లాడుతూ గురువు అనేది కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే శిల్పి అన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మండపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) మండపేటలో 27, 28 వార్డుల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం పరిశీలించారు. వీటి పనులు నాణ్యత ప్రమాణాలతో చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ లంకలపల్లి రాంబాబు, టీడీపీ నాయకుడు ఎండీ ఖరీంఖాదరి, ఎ.రామకృష్ణ చౌదరి, అంజానీ తదితరులు వున్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత: వివిధ వ్యాధులతో బాధపడుతున్న 28 మంది వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.18,55,213 చెక్కులను శనివారం బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే వేగుళ్ల అందజేశారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే వేగుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎన్.వీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కళా ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప విద్యాశాఖాధికారి

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ విద్య, శిక్షణా సంస్థ బొమ్మూరులో ఈనెల 11, 12లో నిర్వహించనున్న కళా ఉత్సవ్ 2025 పోస్టర్‌ను శనివారం ఉప విద్యాశాఖాధికారి ప్రత్తి రామలక్ష్మణమూర్తి ఆవిష్కరించారు. డీవైఈవో కార్యాలయంలో జరిగిన డైట్ ఫిజిక్స్ అధ్యాపకుడు కె.శ్రీకృష్ణసాయి మాట్లాడుతూ కళాఉత్సవ్ 2025 లో పాల్గొనేందుకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులకు గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటక కళలు, దృశ్యకళలు, సంప్రదాయ కథనం వంటి అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు బొమ్మూరు డైట్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కెపీపీ జాతీయోన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మేడిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి'

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని కోరుతూ శనివారం మోడరన్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రదర్శన జరిపారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని నినాదాలు చేశారు. మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జివి రావు మాట్లాడుతూ ప్రజాభీష్టం మేరకు కాకినాడ జిల్లాలో కలపాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ నాయకులు మాగాపు అమ్మిరాజు, కో కన్వీనర్ బి.సిద్ధూ, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ, మోడరన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, నారపురెడ్డి బలరాం, పాలపర్తిమధు, వానపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన జరుపుతున్న మోడరన్ సంస్థల విద్యార్థులు

బీఏఎల్ఎల్‌బీ పట్టా అందజేత

ఆలమూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చెముడులంకకు చెందిన చెక్కా లేఖ్య బీఏ ఎల్ఎల్‌బీ పట్టాను సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నుంచి తీసుకున్నారు. విశాఖ దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో బీఏ ఎల్ఎల్‌బి చదువుతున్న లేఖ్యకు శనివారం యూనివర్సిటీలో పట్టా ప్రదానం చేశారు. ప్రస్తుతం లేఖ్య ఢిల్లీ పార్లమెంట్‌లో లేజిస్టేటివ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. మెజిస్ట్రేట్ పరీక్షల్లో పాల్గొనేందుకు ఈ కోర్సు పూర్తి చేసుకున్న తరువాత రెండేళ్ల గడువు ఉండాలని తాజాగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుకోవడంతో లేఖ్య అప్పటి వరకూ ఈ ఉద్యోగం చేపడుతుంది. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ఆలమూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండల సచివాలయ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. సచివాలయ ఉద్యోగులపై లేనిపోని పనులు మోపి ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆరోపించారు. దీనికి నిరసనగా చేపట్టిన ఆందోళనలో శనివారం సచివాలయ ఉద్యోగులు గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రామచంద్రపురం ప్రాజెక్టు కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. చెలికాని రామారావు స్మారక భవనంలో ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్ల రెండవ మహాసభ జరిగింది. అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేసి అంచెలంచెలుగా డిమాండ్లు సాధించుకుంటున్నారని అన్నారు. నూతన కమిటీ ఎన్నిక అనంతరం రామచంద్రపురం ప్రాజెక్టు కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా నూకల బలరాం, అధ్యక్షులుగా ఉప్పు లూరి వీరలక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా మేడిశెట్టి దుర్గమ్మ, వర్కింగ్ ప్రెసిడెంటుగా వాసంశెట్టి సూర్యకుమారి, ఉపాధ్యక్షులుగా ఎండి జహర, చంద్రకళ, కార్యదర్శులుగా వెంకటరత్నం, సుధా, కోశాధికారిగా కె.దుర్గ, సభ్యులుగా కె.వి. లక్ష్మీరత్నం, కనకదుర్గ, కుంతీదేవి ఎన్నికయ్యారు.